కాలనీల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



దండమూడి ఎన్‌క్లేవ్ కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. కమిటీ సభ్యులను సత్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని, తన సహాయం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. అధ్యక్షుడు కిరణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, కోశాధికారి నాగరాజు పుప్పాల, ఇందిరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో నెలకొన్న సమస్యలపై జర్నలిస్టులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే జర్నలిస్టు కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి వంటి వసతులను కల్పించామని, త్వరలోనే కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పిల్లల పార్కు, చెర్ల ఎల్లమ్మ ఆలయానికి రోడ్డు వంటి అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆస్కాని మారుతి సాగర్, జర్నలిస్టులు లాలయ్య, దేవేందర్, కృష్ణారావు, మారుతి కుమార్, గోవిందరావు, గణేష్, రమేష్, శ్రీనివాసరావు, జగదీష్ గుప్తా, మల్లికార్జున్, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం



ప్రొ.అలోక్‌సింగ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ (ఎస్‌సీఐఎస్)లో ప్రొఫెసర్ డాక్టర్ అలోక్‌సింగ్‌కు అప్లికేషన్, అడ్వాన్స్‌మెంట్, కన్వర్జన్స్‌లో పరిశోధనను ప్రచురించే క్యూ1 జర్నల్, అప్లైడ్ సాఫ్ట్ కంప్యూటింగ్ ఏరియా ఎడిటర్‌గా నియమితులయ్యారు. అంతకుముందు ఆయన అసోసియేట్ ఎడిటర్‌గా ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

కుత్బుల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. బుధవారం గాజులరామారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్ పై మరోసారి నోటికొచ్చినట్టు మాట్లాడితే గల్లీలో తిరగనీయబోమని హెచ్చరించారు. సమేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొడ్డు వెంకటేశ్వరరావు, పాలకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి, నాయకులు గుంజ శ్రీనివాస్, రంగారావు, పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీ కోసం... తప్పని ఎదురు చూపులు!

- ఆధార్, రేషన్, బ్యాంకు ఖాతా ఉన్నా ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- మహాలక్ష్మి పథకం కింద లబ్ధిదారుల సంఖ్య 72,452 మంది
- జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన సిలిండర్లు 1.72 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆసరాగా ఉండేందుకు వంట గ్యాస్ సిలిండర్ రూ. 500 ఇవ్వాలనే ఉద్దేశంతో పథకాన్ని ప్రారంభించింది. రాయితీ సమయానికి రాకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. సమస్యల నివృత్తికి ప్రత్యేకంగా ప్రజాపాలన ఫిర్యాదు కేంద్రాలను ఏర్పాటు చేసినా ఫలితం అంతగా కనిపించటం లేదు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళలు గ్యాస్‌పై రాయితీ వస్తుందనే ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరడం లేదని ఆందోళన చెందుతున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ. 874 ఉండగా అందులో కేంద్రం రాయితీ రూ. 47, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ. 328 పోగా రూ. 500కు మహాలక్ష్మి పథకం కింద సిలిండర్‌ను పొందాల్సి ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ వినియోగదారుడి ఖాతాతో వారంలోగా జమవుతుండగా, రాష్ట్రం నుంచి ఎందుకు సొమ్ము జమ కావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వంటివి అన్నీ సక్రమంగా ఉన్నా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

◆ రాష్ట్రం నుంచి ఎందుకు సొమ్ము జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



ఆందోళనవద్దు...

రేషన్ కార్డు, ఆధార్ అనుసంధానం తదితర కారణాలతో రాయితీ జమ కాకుండా ఉండొచ్చని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పౌరసరఫరాల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. సిలిండర్ తీసుకున్న తర్వాత నాలుగు రోజుల్లో రాయితీ జమ అవుతుందని స్పష్టం చేస్తున్నారు.

గ్యాస్ కనెక్షన్లు ఇలా...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తంగా 14,48,889 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో డబుల్ గ్యాస్ కనెక్షన్లు 8,52,468, సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 5,11,324, దీపం కనెక్షన్లు 70,869, ఉజ్వల కనెక్షన్లు 2,593, కమర్షియల్ కనెక్షన్లు 11,635 ఉన్నాయి.

◆ మహాలక్ష్మి పథకం కింద 74,457 మంది లబ్ధిదారులు ఉన్నారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 1,72,393 సిలిండర్లు తీసుకున్నారు. వీటి కోసం ప్రభుత్వం రూ. 8.61 కోట్లు రాయితీ మంజూరు చేయగా రూ. 5.72 కోట్ల రాయితీ మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తోంది.

వచ్చినా జమ కావడం లేదు...

గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం ఇచ్చే సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా కార్యాలయానికి వెళ్లి అడిగితే రాయితీ వచ్చిందని చెబుతున్నారని పేర్కొంటున్నారు. బ్యాంకులో అడిగితే రాలేదంటున్నారని, ఎందుకు జమ కావడం లేదో తెలియడం లేదంటున్నారు.

గుడి నిర్మాణానికి వ్యతిరేకం కాదు



మాట్లాడుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు శాఖయ్య

బాలానగర్: బాలానగర్ బస్తీలో సంవత్సరాలుగా అన్ని కులాల వారు కలిసి నివసిస్తున్నామని, తాము గుడి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నామని ప్రచారం చేయడం సరికాదని చిత్తారమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు డి. శాఖయ్య అన్నారు. బుధవారం చిత్తారమ్మ డబుల్ బెడ్‌రూమ్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు వ్యక్తులు పార్టీల పేరుతో తమపై బురదజల్లే ప్రయత్నాలు చేయటం తగదన్నారు. డబుల్ బెడ్ రూం సముదాయాలలో చేపట్టిన ఆలయ నిర్మాణానికి అసోసియేషన్ సభ్యులు అభ్యంతరం చెబుతున్నారని ఆకుల నరేందర్ అనే వ్యక్తి ఆరోపణలు చేయటం బాధాకరమన్నారు. కొందరు వ్యక్తులతో నరేందర్ వ్యక్తిగత గొడవలకు పోయి ప్రతి విషయాన్ని అసోసియేషన్‌కు ఆపాదించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అందరి ఆమోదంతోనే షెడ్డు నిర్మాణం చేసినట్లుగా సమావేశంలో పాల్గొన్న చిత్తారమ్మ డబుల్ బెడ్ రూమ్ వాసులు పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురి కాలనీ మోతీనగర్ స్నేహపురి కాలనీలోని బడ్స్ ఇన్ బ్లూమ్స్ పాఠశాలలో అపోలో హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బడ్స్ ఇన్ బ్లూమ్స్ పాఠశాల డైరెక్టర్ శశిభూషణ్ బుధవారం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా పాఠశాల ఆవరణలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ టెస్టు, డెంటల్, ఆర్థోపెడిక్ స్క్రీనింగ్ హై చెకప్‌తో పాటు సాధారణ వ్యాధులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

కాస్మోపాలిటిజం విస్తృతంగా విస్తరించింది

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: కాస్మోపాలిటిజం ప్రపంచ వ్యాప్తంగా చాలా విస్తృతంగా విస్తరించిందని, ప్రతి ఒక్కరిని స్వాగతించే డెక్కన్ ఇంతటి విశ్వనగరంగా ఎదిగిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో బుధవారం కాస్మోపాలిటన్ డెక్కన్‌పై నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పాతబస్తీలోని తన కుటుంబ అనుభవాల గురించి... నిజాం కాలంలో కొండా వెంకటరంగారెడ్డి పనిచేసిన విధానాన్ని ఆయన వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన 'మనూ' వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ దక్కన్ కాస్మోపాలిటన్ ప్రభావాలను వివరించారు. అనంతరం ప్రొఫెసర్ సలీల్ మహ్మద్,ఢిల్లీ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సీమా అల్వీ, ప్రొఫెసర్ సల్మా ఫారూఖీ, అభినారాయణ లంబా దక్కన్ స్మారక చిహ్నాల గురించి, ఆసిఫ్ మాలిద్ తదితరులు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వివరించారు. అనంతరం కాస్మోపాలిటిజంపై చిత్ర ప్రదర్శనను తిలకించారు.

పాయిజన్‌సాగర్

విచ్చలవిడిగా విష రసాయనాలను వదులుతున్న పరిశ్రమలు

- రసాయనాల గాఢతకు ఫాక్స్‌సాగర్‌లో చనిపోతున్న చేపలు
- నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన కరువు



గాఢతకు పెద్దసంఖ్యలో చనిపోయిన చేపలు

కుత్బుల్లాపూర్: ఒకప్పుడు పంట పొలాలకు నీరందించే ఆ చెరువులో ఇప్పుడు కలుషిత జలాలు కలుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు అలుగు పారడంతో ఇదే అదనుగా భావించిన రసాయన పరిశ్రమల యాజమాన్యాలు విష రసాయనాలను చెరువులోకి వదులుతున్నారు. దీంతో వారం రోజులుగా చెరువులో ఉన్న చేపలు చనిపోయి నీటిపై తేలుతున్నాయి. దీంతో చేపలు పట్టేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత సంవత్సరం 2.82 లక్షల చేప పిల్లలను చెరువులో వదిలారు. ఇప్పటికే నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు వైపు కన్నెత్తి చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దూలపల్లి పారిశ్రామికవాడ నుంచి రసాయనాలు..

జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు ఎగువ ప్రాంతంలో దూలపల్లి పారిశ్రామిక వాడ ఉంది. ఇక్కడ అనుమతులు లేని రసాయన గోదుమలు అధికంగా ఉండడం మూలంగా.. వివిధ ఉత్పత్తులు తయారు చేసే క్రమంలో నిల్వచేసిన విష రసాయనాలు వర్షం పడ్డ సమయంలో వదులుతున్నారని ప్రధాన ఆరోపణ. సుమారు 483 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు సమీపంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా కట్టడి చేయాల్సిన ఇరిగేషన్ అధికారులు.. వాటి నిర్మాణాలకు పూర్తి భరోసా ఇస్తూ అందిన కాడికి దండుకుంటూ వచ్చారు.

గతంలో పరిశ్రమలు సీజ్...

◆ ఈ నేపథ్యంలో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పుట్టగొడుగుల్లా రసాయన పరిశ్రమలు వెలువడ్డాయి. గతంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి 'సాక్షి'వరుస కథనాలతో అనుమతులు లేని పరిశ్రమలను గుర్తించి సీజ్ చేస్తూ వచ్చారు. ఆయన బదిలీ కావడంతో మళ్లీ మొదటికే వచ్చింది. సంబంధిత పీసీబీ అధికారులు అనుమతులు లేని విష రసాయనాలు వెలువడే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ వారిచ్చే మామూళ్లకు అలవాటు పడి ఇటువైపు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు లేవు. దీంతో వర్షం పడ్డ.. చెరువు నిండిన సమయాల్లో నిల్వ ఉన్న రసాయనాలు చెరువులోకి వదిలి చేతులు దులుపుకుంటున్నారు. రసాయనాలు వదిలే పరిష్కరణ గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద ఉదయం నిమజ్జనానికి తరలి వచ్చిన గణనాథులు

కొనసాగిన నిమజ్జనం

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద బుధవారం కూడా వినాయక నిమజ్జనాలు కొనసాగాయి. చిన్న గణపతుల నుంచి భారీ గణపతుల వరకు ఉదయం 8 గంటల వరకు బారులు తీరాయి. యువకులు, యువతులు నిమజ్జనానికి తరలి వచ్చి సందడి చేశారు.



గాయత్రినగర్ సంక్షేమ సంఘం లడ్డూను 2 లక్షలకు కైవసం చేసుకున్న జగదీష్ గుప్తా



హష్మత్‌పేట బోయిన్ చెరువులో నిమజ్జనం అవుతున్న వినాయకుడు



వి. రామారావు నగర్‌లోని లడ్డూను 1.17 లక్షలకు కైవసం చేసుకున్న వెంకటయ్య యాదవ్



అవంతినగర్ తోట సంక్షేమ సంఘం లడ్డూను రూ.1.02 లక్షలకు కైవసం చేసుకున్న ప్రసాద్



వినాయక మండపంలో పూజలు చేసిన కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



హష్మత్‌పేట బోయిన్ చెరువు కట్టపై గణేష్‌ల నిమజ్జనం దగ్గర కోలాహలం



వివేకానందసేవా సమితి లడ్డూను రూ.3.90 లక్షలకు దక్కించుకున్న మోహన్ కుమార్



అంజయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ లడ్డూను రూ.3 లక్షలకు దక్కించుకున్న ప్రభాకర్

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ) హైదరాబాద్ క్యాంపస్‌లో ఐటీఐ ట్రేడ్‌లలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని 'మనూ' ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ బుధవారం తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ ద్వారా దరఖాస్తులను పొందవచ్చని, లేనట్లయితే విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కౌన్సిలింగ్‌ను ఈనెల 25వ తేదీన ఉదయం 9.30 గంటలకు గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు.

హెచ్‌సీయూలో 'స్వచ్ఛతా హీ సేవ' షురూ

అక్టోబర్ 2 వరకు 'క్లీనప్ డ్రైవ్'



క్యాంపస్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని గచిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'స్వచ్ఛతా హీ సేవ' పేరిట ప్రత్యేక క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య పర్యవేక్షణలో హెచ్‌సీయూ ఉద్యానవన విభాగం, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగించారు. క్యాంపస్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని అన్నారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష గడువు పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతిలో చేరడానికి దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని ఈనెల 23వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ డి విజయభాస్కర్ బుధవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశ పరీక్షను 2025 జనవరి 18న నిర్వహిస్తారని ఆయన వివరించారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన ప్రస్తుతం 5వ తరగతి విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఈ గడువు తేదీ పెంపుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గేమింగ్ టాలెంట్‌పై ఐఎస్‌బీతో విన్జో సంస్థ భాగస్వామ్యం

రాయదుర్గం: గేమింగ్ టాలెంట్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ కోసం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)తో విన్జో సంస్థ భాగస్వామ్యం చేసుకుంది. రాబోయే పదేళ్లలో 60 బిలియన్ డాలర్ల రంగాన్ని సృష్టించే లక్ష్యంతో రెండు సంస్థలు సమష్టిగా కృషి చేస్తాయి. బుధవారం ఐఎస్‌బీలో ప్రతిష్టాత్మకంగా టాలెంట్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్, బ్యాటిల్ ఆఫ్ సూపర్ స్కాలర్స్(బీఓఎస్ఎస్)ని ప్రారంభించాయి. దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు మార్గదర్శకత్వం చేయడం, సాంకేతిక ఆవిష్కరణలో భారతదేశ నాయకత్వాన్ని నడిపించడంలో అవసరమైన పరిజ్ఞానం అందించడం, ఐపీ ఎగుమతి ఆధారితంగా ఈ రంగ వృద్ధిని పెంచడం , అగ్రశ్రేణి గేమింగ్ మార్కెట్‌లలో భారతదేశాన్ని సమున్నతంగా నిలపడం వంటి వాటిని ప్రోత్సహించడమే ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తాయి.

నిమజ్జన వేడుకల్లో ఘర్షణ

ఇరు వర్గాలపై కేసు నమోదు

గచ్చిబౌలి: వినాయక నిమజ్జనం వేడుకల్లో ఘర్షణ నెలకొంది. యువకులు కుర్చీలు, కర్రలతో దాడులకు దిగడంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. కొండాపూర్‌లోని హిందూ జై గణేష్ యూత్ అసోసియేషన్ మంగళవారం రాత్రి నిమజ్జనం వేడుకలు నిర్వహిస్తున్నారు. స్నేహితుల ఆహ్వానం మేరకు బంజారాహిల్స్‌కు చెందిన చందు, రమణదీప్ తదితరులు కొండాపూర్‌కు వచ్చారు. చిన్న విషయంలో వివాదం నెలకొనడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బంజారాహిల్స్ నుంచి వచ్చిన యువకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు కిరణ్, నీలం రవి తదితరులు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కూకట్‌పల్లి: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయానగర్ కాలనీలో జంక్షన్ వద్ద రూ.16 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడేది లేదన్నారు. రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, విష్ణు, వెంకట్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'మనూ'లో 'ఏక్ పేడ్ మా కే నామ్'



రాయదుర్గం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మనూలో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. పర్యావరణ సుస్థిరతను పెంపొందించడానికి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. 'మనూ నోడల్ అధికారి ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ విద్యార్థులు నాటిన మొక్కలను సంరక్షిస్తారని, హాస్టళ్లలో శుభ్రతా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.